సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

సామాన్యులపై భారం

గోపాలపట్నం: వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి కేంద్ర ప్రభుత్వం సామాన్యులపై భారం మోపిందని కాంగ్రెస్ నాయకుడు సోడదాసి సుధాకర్ విమర్శించారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ గ్యాస్ ధరల పెంపు దారుణమన్నారు. గ్యాస్ సిలిండర్‌పై రూ. 50, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం వల్ల అన్ని వర్గాలపై భారం పడుతుందన్నారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాసేవిధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. వెంటనే పెంపునిర్ణయాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మహిళను వేధించిన వ్యక్తిపై కేసు నమోదు

మల్కాపురం: ఓ మహిళను వేధించిన వ్యక్తిపై మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. జీవీఎంసీ 60వ వార్డు ఇండస్ట్రియల్‌కాలనీలో సంధ్య అనే మహిళ భర్త,పిల్లలతో నివాసం ఉంటుంది. అదే ఇంటిపై ప్రసాద్ అనే వ్యక్తి అద్దెకు ఉంటున్నాడు. ఇది ఇలా ఉంటే సోమవారం రాత్రి సేద తీరేందుకు సంధ్య మేడపైకి వెళ్లింది. ఇది గమనించిన ప్రసాద్ ఆ సమయంలో మేడపైకి వెళ్లి ఆమె చేయి పట్టుకుని వేధించే ప్రయత్నం చేశాడు. అక్కడ నుంచి తప్పించుకుని భర్తకు జరిగిన విషయాన్ని తెలిపింది. దీంతో వారు మంగళవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ప్రసాద్‌ను విచారిస్తున్నారు. విచారణ అనంతరం కేసు పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

4 నుంచి పైడితల్లమ్మ మహోత్సవాలు



సమావేశంలో చర్చిస్తున్న గ్రామ పెద్దలు, ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: పైడితల్లి అమ్మవారి పండగను మే 4 నుంచి 6వ తేదీ వరకూ చేయాలని కమిటీ పెద్దలు నిర్ణయించారు. గోపాలపట్నం ప్రశాంతి నగర్ అమ్మవారి ఆలయంలో మంగళవారం ఆలయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే గణబాబు, గ్రామ పెద్దలు గంర్రెడ్డి పెదబాబు, బుద్ధ శివాజీ, ఆలయ కమిటీ సభ్యు లు పాల్గొన్నారు. మే నెల 4 నుంచి 6 వరకు ఉత్సవాలు చేయాలని నిర్ణయించారు. 4న పుట్ట బంగారం తీయడం, 5 తొలేళ్ల సంబరం, 6న ప్రధాన పండగ నిర్వహించనున్నట్టు వెల్లడించా రు. కార్యక్రమంలో దాడి వెంకటరమేష్, అయితంశెట్టి కోటేశ్వరరావు, చందన గాంధీ, నారిపిన్ని సత్తిరాజు, మళ్ల సతీష్, మూర్తి పట్నాయక్ పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని రైల్వే పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీస్(జీఆర్పీ) సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో, రైల్వే భద్రతా దళం(ఆర్పీఎఫ్) మహిళా ఎస్‌ఐ వి.కీర్తిరెడ్డి, జీఆర్పీ ఎస్‌ఐ ఎస్.రామారావులు తమ సిబ్బందితో కలిసి రైల్వేస్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫామ్‌లలో మంగళవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో చెన్నైకి చెందిన పాండియన్ ఆర్ అక్రమంగా గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డాడు. సుమారు రూ. 26,500 విలువైన 5.3 కేజీల గంజాయిస్వాధీనం చేసుకుని, నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

అక్కిరెడ్డిపాలెం: పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న పచ్చికోళ్ల కృష్ణ మూర్తిని మంగళవారం గాజువాక పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ నెల 2న పీడీఎస్ రైస్ అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో సివిల్ సప్లైఆర్ఐ పద్మావతి దాడులు నిర్వహించారు. రైస్‌ను స్వాధీనం చేసుకున్న సమయంలో కృష్ణ మూర్తి పరుష పదజాలంతో మాట్లాడడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.దీంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

త్వరలో రయ్ రయ్





సింధియా: డాక్‌యార్డ్ సమీపంలో విశాఖ నగరాన్ని కలుపుతూ ఉన్న సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెన పునర్నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఆగస్టు నుంచి నూతన వంతెనపై రాకపోకలు ప్రారంభం కానున్నాయి. ఆ మేరకు పనులను వేగవంతం చేసినట్టు పోర్ట్ అధికారులు వెల్లడించారు. గాజువాక నుంచి సింధియా మీదుగా నగరానికి వెళ్లేందుకు చాలా మంది ఈ వంతెనపైనే రాకపోకలు సాగిస్తారు. ఆ వంతెన మరమ్మతులకు గురికావడంతో 2024 జూలై లో వంతెన పునర్నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. దీంతో వంతెన మార్గంలో వాహనాల రాకపోకలను నిలిపేశారు.

అవి పుకార్లే

కాగా వంతెన పూర్తయితే దాన్ని నేవీకి అప్పగించేస్తారని.. ఇక సాధారణ ప్రజలకు ప్రయాణించే అవకాశం ఉండదని జోరుగా ప్రచారం సాగింది. ఈ నేపథ్యంలో వంతెన నిర్మాణం పూర్తయితే ప్రజాసేవలకే వినియోగిస్తామని పోర్ట్ అధికారులు స్పష్టం చేయడంతో ప్రజలు సంతోషిస్తున్నారు.

దూరం పెరగడంతో ఇక్కట్లు

డాక్‌యార్డ్ మీదుగా నగరానికి వెళ్లే వారు సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెన మీదుగానే ప్రయాణిస్తారు. కానీ నిర్మాణ పనుల దృష్ట్యా వంతెనను మూసివేయడంతో గాజువాక నుంచి సింధియా మీదుగా నగరానికి వెళ్లే వారు సుమారు 9 కిలోమీటర్లు ప్రయాణించి మారుతీ సర్కిల్ వద్ద తిరిగి పోర్ట్ రోడ్డు గుండా కాన్వెంట్ జంక్షన్ చేరుకుని అక్కడి నుంచి నగరానికి వెళ్లాల్సి వస్తోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదే సమయంలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్డు ప్రమాదాలు జరిగి కొందరు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి.

పట్టించుకోని అధికారులు

సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెన మూసివేయడంతో చుట్టూ తిరిగి వెళ్లలేక డాక్‌యార్డ్ ఉద్యోగులు, షిప్‌యార్డ్ కార్మికులు, ఇతర ప్రయాణికులు ప్రత్యామ్నాయంగా ఎస్‌బీసీ వంతెన మీదుగా రాకపోకలకు అనుమతించాలని నిరసన తెలిపినా అటు పోర్టు అధికారులు, ఇటు నగర పోలీసులు పట్టించుకోలేదు. ఈ తరుణంలో వంతెన నిర్మాణ పనులు పూర్తి కావడంతో ఎప్పుడెప్పుడు రాకపోకలకు అనుమతిస్తారని ప్రయాణికులు ఎదురు చూస్తున్నారు. ఆగస్టు నెల కల్లా వంతెనపై రాకపోకలకు అనుమతిస్తామని, అన్నీ పూర్తయితే అంతా కన్నా ముందే రాకపోకలు జరగవచ్చునని పోర్ట్ అధికారులు తెలియజేస్తున్నారు.

కొత్త వంతెన నిర్మాణం ఇలా..

కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఆలస్యంగా వంతెన నిర్మాణ పనులు ప్రారంభమైనప్పటికీ సమయానికి పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే కొత్త వంతెనపై డాక్‌యార్డ్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు చిన్న చిన్న వాహనాలతో రాకపోకలు సాగిస్తున్నారు. ఈ వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు, ఫుట్‌పాత్‌లు నిర్మిస్తున్నారు. మరో వంద సంవత్సరాల వరకు చెక్కు చెదరకుండా ఉండేలా పాత వంతెనను పూర్తిగా నేలమట్టం చేసి సముద్రంలో నుంచి గట్టి ఇనుప స్తంభాలను పటిష్టంగా నిర్మించారు. మిగిలిన నిర్మాణ పనులను త్వరిగతిన పూర్తి చేసి రాకపోకలకు అనుమతించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

దూరం తగ్గుతుంది



నేను షిప్‌యార్డ్‌కాలనీలో నివసిస్తున్నాను. నగరానికి వెళ్లాలంటే సింధియా మీదుగా వెళ్లి అక్కడ నుంచి గొడౌన్ల మీదుగా మారుతీ సర్కిల్‌కి చేరుకుని అక్కడి నుంచి పోర్ట్ రోడ్డు గుండా వెళ్లాల్సివస్తుంది. దీంతో మరో 9 కిలోమీటర్లు ఎక్కువ దూరం ప్రయాణిస్తున్నాను. సమయానికి గమ్యానికి చేరుకోలేక నిత్యం ఇబ్బందులు పడుతున్నాను. సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెనపై రాకపోకలకు అనుమతిస్తే దూరం తగ్గుతుంది. ట్రాఫిక్ ఇక్కట్లు కూడా ఉండవు.

– గుంట్ల శ్రీను, ప్రయాణికుడు

ఎదురుచూస్తున్నాం



గతంలో నగరానికి వెళ్లాలంటే తక్కువ సమయంలోనే చేరుకునే వాళ్లం. కానీ ఇప్పుడు నగరానికి వెళ్లాలంటే సమయంతో పాటు దూరం పెరిగి చాలా ఇబ్బందిపడుతున్నాం. సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెన మూసివేయడంతో అవస్థలు పడుతున్నాం. నిర్మాణ పనులు చివరి దశకు చేరుకోవడంతో రాకపోకలకు ఎప్పుడు అనుమతిస్తారా అని ఎదురుచూస్తున్నాం.

– ఆదారి శ్రీను, ప్రయాణికుడు

సమస్యలు ఏకరువు



మేళాకు హాజరైన ఎమ్మెల్యే గణబాబు, అధికారులు

విశాఖ విద్య: ఇంటిపన్ను విధింపులో సమస్యల పరిష్కారం పేరిట జీవీఎంసీ జోన్–8 అధికారులు మంగళవారం 90వ వార్డు బాజీ జంక్షన్ అన్న క్యాంటీన్ వద్ద 'ఇంటి పన్ను మేళా' నిర్వహించారు. 89,90,91,92 వార్డుల పరిధిలోని ఎన్ఏడీ కొత్తరోడ్ మొదలు కొని వెంకటాపురం వరకు ప్రజానీకం దీన్ని ఏర్పాటు చేసినట్టు జీవీఎంసీ అధికారులు గొప్పలు చెప్పారు. మేళాకు ఎమ్మెల్యే గణబాబు సైతం హాజరయ్యారు. అయితే ఇంటిపన్నులు ఇష్టానుసారంగా విధిస్తుండడంతో ఏటా అధిక మొత్తంలో వస్తున్నాయని పలువురు ఏకరువు పెట్టారు. ఆ డబ్బులు కట్టేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. నీటి కుళాయిల బిల్లుల ఎక్కువ వస్తున్నాయని మరికొంతమంది అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

ఎండలో అవస్థలు

మరో వైపు మేళాకు వచ్చిన ప్రజలంతా మండుటెండలో క్యూ కట్టగా, అక్కడ ఏర్పాటు చేసిన టెంటులో జీవీఎంసీ,సచివాలయ సిబ్బంది కూర్చొన్నారు. మేళా అంటే ఇలానే ఉంటుందా..? అంటూ అక్కడికి వచ్చిన ప్రజానీకం అసంతృప్తి వ్యక్తం చేశారు. మరో వైపు అధికారులతో పాటు కూటమి నాయకులు వేదికపై ఉండడంతో కొంత మంది తమ సమస్యలను చెప్పుకునేందుకు వెనుకంజవేశారు. ఓ పక్క 'ఇంటిపన్నుల మేళా' అనే ఫ్లెక్సీ, మరో పక్క ప్రజా దర్బార్ పేరిట కూటమి నాయకుల ఫ్లెక్సీలను చూసిన ప్రజానీకం ఇంతకీ ఇదేం మేళా..? అని విమర్శిస్తున్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హైమావతి, వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ, జీవీఎంసీ సిబ్బంది , సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఆచార్యులు, విద్యార్థులు

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ, ఐఏఎస్ఈ బీఈడీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో 'సే నో టు డ్రగ్స్' పేరిట మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐఏఎస్ఈ నుంచి ఏయూ రిజిస్ట్రార్ ఆఫీస్ వరకు ర్యాలీ సాగింది. యాంటీ డ్రగ్ ర్యాలీలో ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.నాగరాజ కుమారి, ఆచార్య పుష్ప, అధ్యాపకులు, బీఎడ్ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలపై భారం తగ్గించాలి



ఆటో డ్రైవర్లతో కలిసి ఆందోళన చేస్తున్న వామనమూర్తి

సీతమ్మధార: కేంద్ర ప్రభుత్వం భారీగా పెంచిన గ్యాస్,డీజిల్, పెట్రోల్ ధరలు వెంటనే రద్దు చేయాలి ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత బీజేపీ ఆటో డ్రైవర్స్ అండ్ మోటార్ కార్మికుల మీద ఆర్థిక భారాలు వేసే విధంగా డీజిల్ పెట్రోల్ వంట గ్యాస్ ధరలను భారీగా పెంచి ఆర్థిక భారం మోపిందన్నారు. మంగళవారం ద్వారకా నగర్ జంక్షన్ వద్ద ఆటోడ్రైవర్లు నిరసన ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వామనమూర్తి బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్ మోటార్ వాహన డ్రైవర్లు నిరసన ధర్నా చేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కళ్లు తెరిపించాలని డ్రైవర్లకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యు. శివాజీ, దేవుడు, ఈశ్వర్, రావి కృష్ణ, మురళి తదితరులు పాల్గొన్నారు.

వంటగ్యాస్ ధర తగ్గించాలంటూ సీపీఐ వినూత్న నిరసన



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

సీతమ్మధార: పెంచిన గ్యాస్ ధరను తక్షణమే రద్దు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ వినూత్న నిరసన వ్యక్తం చేసింది. గ్యాస్ బండ నెత్తిన పెట్టుకుని మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం మహిళలంతా కలిసి కట్టెల పొయ్యిపై వంటావార్పు చేశారు.ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు మాట్లాడుతూ గృహావసరాలకు వినియోగించే 14.2 కిలోల ఎల్పీజీ గ్యాస్ బండపై రూ.50 చొప్పున పెంచడంవలన పేద ప్రజలపై మరింత భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో బండపై అదనంగా రూ.50 చెల్లించాల్సి ఉంటుందన్నారు. వెంటనే పెంచిన వంట గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.విమల, ఎస్‌కే రెహమాన్, పి.చంద్రశేఖర్, ఎం.మన్మథరావు, జి.రాంబాబు, సీఎస్ తదితరులు పాల్గొన్నారు.

డేట్ ఆఫ్ జాయినింగ్ సమస్య పరిష్కరించాలని వినతి

అక్కిరెడ్డిపాలెం: సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ , కార్మికుల డేట్ ఆఫ్ జాయినింగ్‌లో తప్పులను సరి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ భెల్ (హెచ్‌పీవీపీ) గుర్తింపు యూనియన్ నాయకులు మంగళవారం ఎంపీ భరత్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కొందరికి పీఎఫ్ ఎంట్రీ 1992కు బదులు 1997గా నమోదైందని, కొందరికి 2011గా నమోదు కావడంతో హయ్యర్ పెన్షన్ రిజక్ట్ అయిందని తెలిపారు. ఈ అంశాన్ని సంబంధిత మంత్రి, భెల్ యాజమాన్యంతో చర్చించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ నాయకులు బొండ బాబూరావు, సుభాకర్ సాహూ, పి.వి.ఎస్.రాజు, కొల్లి దేముడు, టెక్కలి భాస్కరరావు, అల్లం వెంకటేశ్వరరావు, టి.ఎల్.నర్సింగరావు, అప్పలరాజు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

బెహరా కళాశాల ఆధ్వర్యంలో ఉచితంగా పాలిసెట్ కోచింగ్

గోపాలపట్నం: పదోతరగతి తర్వాత పాలిటెక్నిక్‌లో చేరేందుకు నిర్వహించే పాలిసెట్‌కు హాజరయ్యే వారికి కోచింగ్ ఉచితంగా ఇస్తున్నామని బెహరా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య ఒక ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలో 5 చోట్ల ఉచిత కోచింగ్ సెంటర్లు నడుపుతున్నామని వెల్లడించారు. గాజువాకలో వాసన్ ఐకేర్ ఎదురు భవనంలో కోచింగ్ ఇస్తున్నామని తెలిపారు. పూర్తి వివరాలకు నాగలక్ష్మిని 70138 67505 నంబర్‌లో సప్రదించాలని కోరారు. కణితి జెడ్పీ హైస్కూల్‌లో కామేష్ కోచింగ్ ఇస్తున్నారని.. వివరాలకు 90304 85833నబర్‌లో సంప్రదించాలన్నారు. గోపాలపటన్నంలో వసంత నిర్వహిస్తున్నారని.. 79812 15413 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. నరవ బెహరా పాలిటెక్నిక్ కళాశాలలో నిఖిల నిర్వహిస్తున్నారని 79978 94792 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. చోడవరం ప్రేమ సమాజంలో డాక్టర్ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో కోచింగ్ జరుగుతుందని.. 97011 33586నంబర్‌లో వివరాలు తెలుసుకోవాలని కోరారు.

నరవ ఇంజినీరింగ్ కళాశాలలో..

గోపాలపట్నం: నరవలోని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఉచిత పాలిసెట్ కోచింగ్ ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రతీ రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు చేరాలని కోరారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి.. పూజలో పాల్గొన్న పలువురు దంపతులు

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

సీపీఎం రాష్ట్ర నాయకుడు లోకనాథం



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

మల్కాపురం: అర్హులైన పేదలకు తక్షణమే ఇళ్లస్థలాలు కేటాయించి ఇంటి పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.లోకనాథం డిమాండ్ చేశారు. మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ములగాడ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇంటి పట్టాలు మంజూరు చేయాలని ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గడిచిన ఎన్నికల్లో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ రాష్ట్రంలోని నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలతో పాటు ఇంటి నిర్మాణం కోసం సాయం అందిస్తామని హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. తీరా అధికారంలోకి వచ్చి 10 నెలలు కావస్తున్నా నేటికీ ఆ మాట నెలబెట్టుకోకపోవడం వారికి పేద ప్రజల పట్ల ఎంత ప్రేమ ఉందో తెలస్తుందని వివరించారు. జీవో నెంబర్ 296, 388 ప్రకారం అర్హులైన నిరుపేదలకు ఇంటి పట్టాలు, రిజిస్టేషన్లు చేయాలని డిమాండ్ చేశారు.సీపీఎం జిల్లా నాయకుడు ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ జీవో 296 , 388 ప్రకారం మంజూరైన ఇంటి పట్టాలకు రెండేళ్ల తర్వాత రిజిస్టేషన్ చేసుకోవచ్చునని చెప్పినా దానికి సంబంధించి జీవో ఇవ్వక పోవడం ఏంటని ప్రశ్నించారు. ఉచిత గ్యాస్ పథకం ఎంత మందికి వర్తిస్తుందో కూటమి నాయకులు చెప్పగలరా అని సవాల్ విసిరారు. అనంతరం సమస్యలపై ములగాడ తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి,పెంటారావు,పైడిరాజు,ఎస్.శ్రీనివాస్‌రావు,పి.రామారావు,రమణ, ఆర్.విమల,పి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు కేటాయించాలి



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న సీపీఐ నాయకుడు సత్యాంజనేయ తదితరులు

మల్కాపురం: టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అందించకపోవడం దారుణమని సీపీఐ జిల్లా నాయకుడు కాంద్రేంగుల సత్యాంజనేయ అన్నారు. 58వ వార్డు ములగాడలోని నిర్మించిన టిడ్కో గృహ సముదాయాలను మంగళవారం సీపీఐ బృందం సందర్శించింది. సత్యాంజనేయ మాట్లాడుతూ సొంతింటి కల నెరవేరుతుందని ఆశతో ఎంతో మంది పేదలు డీడీలు చెల్లించారన్నారు. దాదాపు పది సంవత్సరాలు గడుస్తున్నా ఇళ్లు కేటాయించక పోవడంతో వారంతా ఆర్థికంగా అవస్థలు పడుతున్నారన్నారు. ఇంట్లో గడిపే అవకాశం కూటమి ప్రభుత్వం కల్పించకపోవడం చాలా దుర్మార్గమన్నారు.అర్హులైన వారికి తక్షణమే ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గుండాల రాంబాబు,వి.త్రినాథ్,కనకేశ్వరరావు,కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ నూతన కమిటీ



మాట్లాడుతున్న అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డు కల్యాణరావు, ప్రభాకర్

సీతంపేట: అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ (ఏఎంసీ) నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం రామాటాకీస్ రోడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో జరిగింది. నూతన అధ్యక్షుడిగా బొడ్డు కల్యాణరావు, కార్యదర్శిగా జేవీ ప్రభాకర్, కోశాధికారిగా గార సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేశారు. ఉపాధ్యక్షులుగా మద్ది అప్పలకొండ, అలమండ ప్రసాద్, సంయుక్త కార్యదర్శులుగా బత్తుల గౌతంబాబు, పతివాడ రాంబాబు, ఇతర కార్యవర్గ సభ్యులు అతిథుల సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీలకు విద్యా ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా అంబేడ్కర్ ఆలోచన విధానాలను ముందుకు తీసుకువెళ్తామని తెలిపింది. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ విశ్రాంత సూపరింటెండెంట్ డాక్టర్ అర్జున, మాజీ ఐఆర్ఎస్ అధికారి జంగాలయ్య పాల్గొన్నారు.

అప్పన్న కల్యాణం.. పులకించిన భక్తజనం



కొట్నం దంచుతున్న పురోహితులు, చిత్రంలో ఈవో సుబ్బారావు దంపతులు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణ శోభతో సింహగిరిపై సందడి నెలకొంది. విద్యుద్దీప కాంతులు ధగధగలాడాయి. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు కొట్నాల ఉత్సవంతో ప్రారంభమైన కల్యాణోత్సవ ఘట్టాలు రాత్రి జరిగిన వార్షిక కల్యాణ మహోత్సవంతో ముగిశాయి. వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారి కల్యాణాన్ని కనులారా తిలకించి పులకించారు. అర్చకులు, ముత్తైదువులు, దేవస్థానం ఈవో కె.సుబ్బారావు దంపతులు కొట్నాలు ఉత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద గరుడాళ్వార్ చిత్రపటాన్ని ఎగురవేసి, ధ్వజారోహణం జరిపారు. సింహగిరి మాడ వీధుల్లో ఎదురు సన్నాహోత్సవం, రథోత్సవం, ఉత్తర రాజగోపురం ఎదురుగా ఉన్న ప్రాంగణంలో ఏర్పాటుచేసి భారీ వేదికపై వార్షిక కల్యాణోత్సవం వైభవంగా జరిగాయి. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు. కల్యాణోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక, నృత్యప్రదర్శనలు అలరించాయి. - సింహాచలం



బాలికల కోలాటం



ఆకట్టుకున్న శక్తి వేషాలు